క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థినుల ఎంపిక



మునుకుళ్ల(తిరువూరురూరల్): రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన ఇరువురు బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బీ వీరభద్రరావు శనివారం తెలిపారు. కబడ్డీలో ఎన్ కీర్తి, రన్నింగ్‌లో కే లావణ్య రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థినులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయిని వేణికృష్ణమ్మను అభినందించారు.

క్రీడా దుస్తుల పంపిణీ



జి.కొండూరు: మండల పరిధి చెవుటూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బండారు అంకబాబు, రమాదేవి దంపతులు స్థానిక జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు రూ.12వేలు విలువ గల క్రీడా దుస్తులను శనివారం అందజేశారు. ఈ క్రమంలో దాత బండారు రమాదేవిని పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కేఎస్‌జె లక్ష్మి పాల్గొన్నారు.

ఉన్నత స్థానాల్లో స్థిరపడాలి

నూజివీడు: విద్యార్థినులు బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సీడీపీఓ ఎస్వై నూరాణి అన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల కాలేజీ హాస్టల్ విద్యార్థినులకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక, వివిధ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ యుక్త వయస్సులో మనస్సు పరిపరి విధాలుగా అనేక ఆకర్షణలకు గురవుతూ ఉంటుందని, అటువంటి వాటినన్ని నిగ్రహంతో జయించి కేవలం చదువుపైనే దృష్టిని పెట్టాలన్నారు. ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పశ్చిమ ఇబ్రహీంపట్నం ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. ప్రభుత్వ మెనూ అమలు తీరు, ఆహారం నాణ్యత, రుచి, విద్యార్థులు హాజరు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. భోజనం చేసే ప్రాంతం, తాగునీరు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

మైలవరం: ఐసీడీఎస్ ప్రాజక్టు మైలవరం పరిధిలో అంగన్‌వాడీ సహాయకురాళ్ల పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సీడీపీఓ కే పుష్పలత శనివారం తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం తిలోచనాపురం బీసీ-డి, దాములూరు బీసీ-ఈ, జి.కొండూరు మండలం తెల్లదేవరపాడు ఎస్సీలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు పూర్తి చేసి రెండు సెట్స్ ఈ నెల 10వ తేదీ లోపు స్వయంగా కార్యాలయానికి వచ్చి అందజేయాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్, 10వ తరగతి మార్కుల లిస్టు, నివాసిత ధ్రువీకరణ పత్రం జతపర్చాలని తెలిపారు. స్థానికులు, వివాహితులై, 21 నుంచి 35 సంవత్సరాలు లోపు వారై ఉండి, 10వ తరగతి పాసై ఉండాలని పేర్కొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



గొల్లపల్లిలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో మండల పరిషత్‌కు చెందిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షలు, పంచాయతీకి చెందిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.15 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే ప్రతాప్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సచివాలయాలను, రైతుభరోసా కేంద్రాలను, వైఎస్సార్ విలేజీ క్లినిక్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి అన్ని వర్గాల ప్రజలకు అన్ని సదుపాయాలను గ్రామ స్థాయిలోకే తీసుకొచ్చి వారి అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో గ్రామంలో సచివాలయ భవనాన్ని నిర్మించుకోవడంతో పాటు రూ.35 లక్షలతో సిమెంట్ రోడ్డులను నిర్మించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే రైతులకు ఎంతో ప్రయోజనమైన ఊరక కాల్వపై రూ.40 లక్షలతో వంతెన నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ గ్రామంలో త్వరలోనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, దీనివల్ల మరో రూ.40 లక్షల నిధులు వస్తాయని, వాటితో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ప్రకటించి దాని ప్రకారం ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోన్న దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సైతం ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికితేనే సంక్షేమ పథకాలన్నీ అమలవుతాయని, రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరేపల్లి శిరీష, ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యులు చల్లారి రేణుక ధనలక్ష్మి, రామయ్య, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు రాఘవ, లెనిన్, రాంబాబు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో సమయం, డబ్బు ఆదా

15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ



సమావేశంలో మాట్లాడుతున్న 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ

నూజివీడు: పట్టణంలోని కోర్టు భవనాల ప్రాంగణంలో వచ్చే నెల 9న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ పేర్కొన్నారు. స్థానిక 15వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో శనివారం పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. సివిల్ కేసులు, పరిష్కరింపదగిన క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మనోవర్తి కేసులు, వాహన ప్రమాద నష్టపరిహార తదితర కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. రాజీమార్గంలో పరిష్కరించే ఈ కేసులపై అప్పీలుకు వెళ్లే అవకాశం కూడా ఉండదన్నారు. ఈ పరిస్థితుల్లో కక్షిదారులు ఆవేశంలో చేసిన తప్పిదాలను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు మంచి అవకాశమన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కే హరిబాబు, స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, ఏపీపీలు ఎస్ఏ ఖాన్, కిషోర్, డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్, పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనపై అవగాహన

మునునూరు: అవినీతిని నిర్మూలించడం ద్వారా భారతీయతను చాటుదామని, సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ప్రతి ఒక్కరం జాగ్రత్త పడదామని రమణక్కపేట యూనియన్ బ్యాంక్ మేనేజర్ బి.మహేష్ పేర్కొన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని సూరేపల్లి, శివారు గ్రామం గొల్లగూడెంలలో అవినీతి నిర్మూలన, సైబర్ నేరాల నిరోధంపై శుక్రవారం రాత్రి, శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, లంచగొండితనం లేని భారత నిర్మాణానికి అందరూ కృషి చేయాలన్నారు. లంచాలు ఇవ్వడం, తీసుకోవడం రెండూ నేరమనే విషయం అందరూ తెలుసుకోవాలన్నారు. బ్యాంకులు, కార్యాలయాల్లో లంచాలు ఇవ్వరాదని సూచించారు. స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇటీవల పల్లెలు, పట్టణాల్లో సైబర్ నేరగాళ్లు ఓటీపీలు, లోన్‌యాప్‌ల పేరున, ఏటీఎంల వద్ద అందరినీ బురిడీ కొట్టిస్తున్నారని, వారి బారినపడి మోసపోవద్దన్నారు. దీని నుంచి కాపాడుకునేందుకు ప్రజలు చైతన్యం కావాలన్నారు. లోన్‌యాప్‌ల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని రైతులకు సూచించారు. కార్యక్రమాల్లో డెప్యూటీ మేనేజర్ రాజేష్ పాల్గొన్నారు.

గంపలగూడెం ఎఫ్ఏసీ ఎంపీడీఓగా నాగేశ్వరరావు

గంపలగూడెం: గంపలగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా తిరువూరు ఎంపీడీఓ పీవీఎస్ నాగేశ్వరరావు(ఎఫ్‌సీఏ) శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎర్రమల పిచ్చిరెడ్డి ఉద్యోగోన్నతితో డీఎల్‌డీఓగా రాష్ట్ర కమిషనరేట్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

సొంత భవనంలోకి వార్డు సచివాలయం

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీలోని పశ్చిమ ఇబ్రహీంపట్నం 4వ సచివాలయం పరిపాల కార్యకలాపాలు సొంత భవనంలో ప్రారంభించారు. ఇటీవల రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సచివాలయం భవనం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. దీంతో ఇప్పటి వరకు అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహించిన సచివాలయం ఉద్యోగులు ఎట్టకేలకు సొంతభవనంలోకి మారారు.

డిజిటల్ సేవలపై కళాజాత

జి.కొండూరు: గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సహకార కేంద్ర బ్యాంకు అందిస్తున్న డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించేందుకు నాబార్డు సౌజన్యంతో పీఏసీఎస్ చైర్మన్ వేములకొండ రాంబాబు ఆధ్వర్యంలో జి.కొండూరులో శనివారం కళాజాతను నిర్వహించారు. ఈ కళాజాతలో భాగంగా సహకార బ్యాంకులో పొదుపు ఖాతా ఉండడం వలన ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, ఏటీఎం రూపే, డెబిట్ కార్డులు, నగదు రహిత లావాదేవీలు వంటి సేవలు పొందవచ్చని కళాకారులు అవగాహన కల్పించారు.

ప్రజారక్షణ భేరి సభను విజయవంతం చేయండి

రెడ్డిగూడెం: విజయవాడ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఈ నెల 15వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజా రక్షణభేరి సభను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలో శనివారం ఆ పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో ఉన్న ప్రజలను నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం విడదీసి పాలిస్తోందని ఆరోపించారు. మన రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీగా ఉన్న టీడీపీ, మార్పుకోసం అంటూ వచ్చిన జనసేన పార్టీలు బీజేపీకి లొంగిపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జంగా వెంకటరెడ్డి, నాయకులు చాట్ల సుధాకర్, ఎం. మాధవ రెడ్డి, ఉయ్యూరు కృష్ణారెడ్డి, రావూరి రమేష్‌బాబు, కే బాలకృష్ణ, వెంకటరెడ్డి, ఇస్సాకు, ఏ.కొండూరు మండలానికి చెందిన నాయకులు జట్టి వెంకటేశ్వరరావు, ఆనందరావు, అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

బూత్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం



బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: స్థానిక గ్రామ పంచాయతీ బూత్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి ఎంపీపీ కార్యాలయం మీటింగ్ హాల్లో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బూత్ కమిటీలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ నాగమల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివబాజీ, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే పర్యావరణాన్ని కాపాడుకోవాలి

నూజివీడు: విద్యార్థి దశ నుంచే పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని, భావి తరాల వారు జీవించడానికి అవసరమైన అనుకూల వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్ డైరెక్టర్ పీ ప్రవంతి అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌ను శనివారం ఆమె సందర్శించి పాఠశాలలో అమలవుతోన్న గ్రీన్ కోర్ కార్యకలాపాలను, పర్యావరణ హిత కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా 9, 10 తరగతుల విద్యార్థినులతో ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంలో చెట్లు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి జీ సత్యనారాయణ, సమన్వయకర్త వెంకటేశ్వరరావు, జాయింట్ కోఆర్డినేటర్ కాకిలేటి శ్యామ్‌బాబు, హెచ్ఎం వీవీఎస్ శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ఆకాంక్ష



మాట్లాడుతున్న ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి

గంపలగూడెం: పేదల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్ష అని గంపలగూడెం ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇచ్చి ప్రజలకు, విద్యార్థులకు ఏ విధమైన సమస్యలు లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. కనుమూరుకు తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి గతంలో నిర్వహించిన బస్ సర్వీసును పునరుద్ధరించాలని సర్పంచ్ మంద మారేశ్వరి కోరారు. ఏఓ సాయిశ్రీ మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కి సంబంధించిన అర్హత ఉండి రైతు భరోసా నగదు పడని రైతులకు ఈ నెల 7వ తేదీన ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు 17 మంది ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్ వాకా నాగరాజు, పలువురు పీడీలు

నూజివీడు: అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-14 బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు పట్టణంలోని విక్టోరియా పురమందిరం గ్రౌండ్‌లో శిక్షణ పొందిన 17 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ వాకా నాగరాజు తెలిపారు. బాలుర జట్టుకు ఎనిమిది మంది, బాలికల జట్టుకు తొమ్మిది మంది క్రీడాకారులు ఎంపికయ్యారన్నారు. వారందరని కోచ్ నాగరాజుతో పాటు పీడీలు ఎస్ లక్ష్మీ, వాకా వనజ, డీ సతీష్‌కుమార్, వీ శ్రీనివాస్ అభినందించారు.

ఆర్థిక సాయం

ఏ.కొండూరు: స్థానిక పీఏసీఎస్ సభ్యులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ కేవీ పురుషోత్తమరావు శనివారం తెలిపారు. ఏ.కొండూరు గ్రామానికి చెందిన జి. శ్రీనివాసరావు, షేక్ మొహమ్మద్ అలీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుల కుటుంబాలకు కేడీసీసీ బ్యాంక్ సంయుక్తంగా చెల్లించిన ఎల్ఐసీ ద్వారా ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.2 లక్షలు అందించినట్లు పేర్కొన్నారు. కేడీసీసీ బ్యాంకు ఏజీఎం కె.దేవేంద్రావు, బ్రాంచ్ మేనేజర్ పి.సత్యనారాయణ, కార్యదర్శి వి.నరసింహారావు పాల్గొన్నారు.

రోగులకు సత్వర సేవలందించాలి

చౌటపల్లి(తిరువూరురూరల్): పేద రోగులకు ఆస్పత్రుల్లో సత్వర సేవలందించాలని తిరువూరు మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి అన్నారు. మండలంలోని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వం ప్రజారోగ్యానికి కోట్లాది రూపాయలు కేటాయిస్తోందని, ఫ్యామిలీ ఫిజీషియన్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలతో రోగుల ఇంటివద్దకే వైద్యసేవలు అందించే అవకాశం వచ్చిందన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆస్పత్రి వైద్యాధికారి కల్యాణ్‌చక్రవర్తి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు ఆవరణలో బాణసంచా దుకాణాలు

ఆగిరిపల్లి: దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలను స్థానికంగా ఉన్న మార్కెట్‌యార్డు ఆవరణలో ఏర్పాటు చేసుకోవాలని ఆగిరిపల్లి ఎస్సై నంబూరు చంటిబాబు తెలిపారు. దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనువైన స్థలం ఎంపిక కోసం మార్కెట్ యార్డు ఆవరణను ఎస్సై శనివారం పరిశీలించారు. ఎస్సైతో పాటు ఏఎస్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మైలవరం: మద్యం సీసాలు గరిష్ఠ చిల్లర ధరకు మించి ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు ఎక్సైజ్ విజిలెన్స్ సీఐ జే శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ఎక్సైజ్ విజిలెన్స్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు గత రాత్రి మైలవరం పట్టణంలోని పలు మద్యం షాపులలో తనిఖీలు నిర్వహించారు. మైలవరం పోస్టాఫీస్ రోడ్డులోని మద్యం షాపులో పని చేసే సేల్స్‌మ్యాన్ బాణావత్ చంటిబాబు గరిష్ఠ ధర కంటే రూ.5కు అధికంగా అమ్ముతుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారెడ్డి, కానిస్టేబుల్ మోహన్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

మునునూరు: యువతి అదృశ్యంపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై ఎం.కుటుంబరావు కథనం మేరకు చెక్కపల్లికి చెందిన పల్లి రాంబాబు కుమార్తె ప్రియాంక ఈ నెల రెండో తేదీ కనిపించడం లేదు. ఇంట్లో ఉన్న రూ.50 వేల నగదు, ఒక మొబైల్ ఫోన్ తనతోపాటు తీసుకు వెళ్లింది. బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తండ్రి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలపారు.

సమన్వయంతో సేవలు అందించాలి



ప్రశాంతిని సత్కరిస్తున్న ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ, ఏఆర్‌టీ సిబ్బంది

చిట్టినగర్(విజయవాడవెస్ట్): ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి సూచించారు. జక్కంపూడి కాలనీలోని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో శనివారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో భాగంగా జిల్లాలోని ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ, ఏఆర్‌టీ సెంటర్ ఉద్యోగుల పనితీరును ఉషారాణి సమీక్షించారు. ప్రతి ఒక్కరూ నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కిరణ్‌పందిటి మాట్లాడుతూ హెచ్ఐవీ కేసులను ఆరంభ దశలోనే గుర్తించి ఏఆర్‌టీ చికిత్స ఇప్పించాలని సూచించారు. అనంతరం విభాగాల వారీగా సమీక్ష నిర్వహించారు.

ఐసీటీసీ సూపర్‌వైజర్‌కు సత్కారం

ఉద్యోగోన్నతిపై బదిలీపై వెళ్తున్న జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ జె. ప్రశాంతి చౌదరిని జిల్లా ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ, ఏఆర్‌టీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. 14 సంవత్సరాలుగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఆమె అందించిన సేవలను కొనియాడారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో పనిచేసి వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లిన దేవదానంను సత్కరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి

తిరువూరు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల నమోదు వేగవంతం చేయాలని తిరువూరు తహసీల్దారు సురేష్‌బాబు కోరారు. తిరువూరు పట్టణంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదుకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ను శనివారం తనిఖీ చేశారు. అన్ని కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటు లో ఉంటారని, కొత్తగా ఓటుహక్కు కోరేవారు, ఓటర్ల జాబితాలో పేర్ల సవరణ, తొలగింపు, ఓటు ఒకచోటి నుంచి మరొక చోటకు బదిలీ కోరుకునే వారు నిర్ణీత నమూనాలో క్లెయిములు దాఖలు చేయాలని సూచించారు. ఆదివారం కూడా స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 404 దరఖాస్తులు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన ఓటర్ల నమోదు స్పెషల్‌డ్రైవ్‌లో 404 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. ఓటుహక్కు కోసం 233, తొలగింపునకు 23, సవరణకు 143 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఓటర్ నమోదుకు 51 దరఖాస్తులు

గంపలగూడెం: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం మండలంలోని 69 పోలింగ్ బూత్‌లలో శనివారం ప్రత్యేక హోదా నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయా కేంద్రాలలో బీఎల్‌ఓలకు నూతనంగా ఓటు హక్కు కోరుతూ 51మంది, తొలగింపులకు 11, సవరణకోసం 22 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం కూడా అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటర్ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన

నర్మదానగర్(విస్సన్నపేట):మండలంలోని నర్మదానగర్‌లో పోలింగ్ బూత్‌ను ఆర్డీఓ కొత్తా మాధవి శనివారం పరిశీలించారు. సంబంధిత ఓటర్ల జాబితాను, పోలింగ్‌బూత్ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన

చాట్రాయి: ఒక వ్యక్తికి ఒకే చోట ఓటు కలిగియుండాలని నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ అన్నారు. మండలంలోని చాట్రాయి, పోలవరం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను శనివారం ఆయన పరిశీలించారు. ఒకే డోర్ నంబర్లో ఎక్కువ ఓట్లు నమోదు చేయకూడదని సూచించారు. తహసీల్దార్ విశ్వనాధరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఓటర్ల నమోదు

ఆగిరిపల్లి: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 5, 6 తేదీల్లో మండలంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఉదయభాస్కర్ శనివారం తెలిపారు. ఈ అవకాశాన్ని ఓటు హక్కు లేని వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.